

3 నుంచి పింఛను పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మార్చి ఆడిటింగ్‌తో బ్యాంకు బిజీబిజీగా ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ మాసం సామాజిక పింఛన్ పంపిణీ మూడో తేదీ నుండీ చేపట్టాలని సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి ఫించన్ పంపిణీ చేశారు. అయితే కొన్ని కారణాలతో ఏప్రిల్ నెల పింఛన్ పంపిణీ ఆలస్యం అవుతున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలియజేస్తున్నారు. సామాజిక పింఛనుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నారు.

ట్యాబ్‌లతో తంటాలు

- మరమ్మతులతో విద్యార్థుల అవస్థలు
- పర్యవేక్షణ లోపంతో అంతంతమాత్రంగా పాఠాలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ఎనిమిదో తరగతి నుండీ పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఒక్కో ట్యాబ్ నిర్వహణకు రూ.30 నుండీ 35వేల వరకు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం గొప్పలు చెప్పకుంది. బైజ్యూస్‌తో కుదుర్చుకున్న ఒప్పదం మేరకు కార్పొరేట్ సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా ఉందంటూ ఉపాధ్యాయ సంఘాల నుండీ విమర్శలొచ్చాయి. వీటిని పట్టించుకోకుండా విద్యాశాఖలో కొత్త అధ్యాయానికి తెరతీస్తున్నట్లు ప్రకటించుకున్న ప్రభుత్వం తీరా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఆసన్నం కావడంతో ఉత్తీర్ణతా శాతం పెంపు ఉపాధ్యాయులే కీలకమన్న విషయాన్ని ఆలస్యంగా గుర్తించేందేమో కొత్తపల్లవి అందుకుంది. ఉత్తీర్ణతాశాతం పెరగాలంటే ఉపాధ్యాయులే బోధనే కీలకమంటూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తోంది.

ట్యాబ్ పాఠాల లోపాలు...

జిల్లాలో ఎనిదో తరగతి నుండీ పదో తరగతి చదువుతున్న 27,960మంది విద్యార్థులు అలాగే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ట్యాబ్‌ల వినియోగంపై ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. బైజ్యూస్ యాప్ డౌన్‌లోడు చేసున్నా నేరుగా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలకు అలవాటు పడ్డ విద్యార్థులకు ట్యాబ్ పాఠాలు అంతగా అర్థం కావడం లేదు. కొన్ని ట్యాబ్‌లో ఎర్రర్ వస్తోంది. చిన్నచిన్న మరమ్మతులు చేసుకోవడం కోసం విద్యార్థులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. బడిలో నేర్చుకున్న పాఠాలతో పాటు ఇంటికీ వెళ్లాకా అదే పాఠాలను మరోమారు గుర్తు చేసుకోవడం వల్ల విద్యార్థులు చదువుల్లో రాణిస్తారనే ఉద్దేశంతో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం గాడితప్పుతోందనే విమర్శలున్నాయి. ట్యాబ్‌ల్లో గణితం, సామాన్య, సంఘీకశాస్త్రం పాఠాలు మాత్రమే వస్తున్నాయి. ట్యాబ్‌ల పంపిణీ ప్రచారం కోసమేనని నిర్వహణ ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలోస్తున్నాయి.

మరమ్మతుల బాధ్యత ఎవరిది..

నిర్వహణ బాధ్యత సచివాలయ సిబ్బందికి అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా సచివాలయ సిబ్బంది తలకుమించిన విధులతో తలలు పట్టుకుంటే ఇక ట్యాబ్‌ల మరమ్మతులు పట్టించుకున్నారా అనేది ప్రశ్నే... ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ట్యాబ్‌ల్లో మరమ్మతులకు గురైనవి విద్యార్థులు మూలనపెట్టి వీటిని ఏమి చేయాలిరా దేవుడా అంటున్నారు. మరోవైపు ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్నారా అనే పర్యవేక్షణ లేకపోవడం లోపంగా ఉంది. ట్యాబ్‌ల నిర్వహణపై ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ ఇవ్వకపోవడంతో వీటి వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు కసరత్తు చేయాల్సి వస్తోంది.

వందశాతం వినియోగించేలా చూస్తాం..



విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేసింది. వీటి వినియోగ వందశాతం ఉండేలా చర్యలు తీసుకుటాం. ఈమేరకు ఎంఈఒలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పాఠశాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా ట్యాబ్‌లు తీసుకురావాలి. మరమ్మతులకు గురైన వాటిని బాగు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం.

-విజయేంద్రరావు, జిల్లా విద్యాశాఖాధికారి

అంతా కల్తీమయం..!

- ప్రజారోగ్యంతో చెలగాటం
- హోటళ్లు, మాంసం దుకాణాలపై దాడులు నామమాత్రం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు కార్పోరేషన్ పరిధిలోని నిబంధనలు పాటించకుండా చికెన్, మాంసం షాపుల్లో క్వాలిటీలేని మాంసం విక్రయాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం అడుతున్నాయి. ప్రజాఆరోగ్యం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న మాసం దుకాణాలు, తినుబండారు, హోటల్స్‌పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ, ఫుడ్ కంట్రోల్ అధికారులు మొద్దునిద్ర వీరికి వరంగా మారుతోంది. కల్తీ నూనెలు, ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు ఉపయోగిస్తూ ప్రజలఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

ఇటీవల నగర కమిషనర్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రముఖ హోటల్‌ను తనిఖీ చేసి పాడైన మాంసం, ఆహార పదార్థాలు ప్రజలు అందిస్తున్నారని సీజ్ చేశారు. ఆ హోటల్ ప్రముఖ రాజకీయ నేతది కావడంతో ఒత్తిళ్ళు ఎదురుకోవాల్సి వచ్చింది. ఇలా నగరంలోని అనేక హోటల్స్ కనీస ప్రమాణాలు పాటించకుండా లాభార్జనే ప్రధానంగా విక్రయాలు జరుపుతున్నాయనే విమర్శలున్నాయి.

విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

నగరంలోని అనేక ప్రాంతాలతో పాటు నగర శివార ప్రాంతాల్లో ఉన్న మాంసం విక్రయదార్లు ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ఏదోఒక జబ్బుతో చనిపోయిన కోళ్ళు విక్రయిస్తున్నారు. ఇక మేక, పొట్టేళు మాంసం విక్రయించాలంటే పశువైద్యులు పరీక్షలు నిర్వహించి సీల్‌వేసిన తరువాత విక్రయించాలి. అయితే నగరంలో అలాంటివేవి జరగడం లేదు. నగరపాలక సంస్థ పశువధశాల్లో పశువైద్యులు లేకపోవడంతో అనారోగ్యంగా ఉన్న జంతువులను కూడా వధించి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సంతపేట, గిరింప్‌పేట, దొడ్డిపల్లి ఇలా అనేక ప్రాంతాల్లో ఆదివారాల్లో రోడ్లపై గొర్రెలు, మేకలు, పొటేళ్ళు వధించి విక్రయిస్తున్నా పట్టించుకొనే నాధుడే కరువయ్యారు.

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో దాదాపు 90కి పైగా మటన్, చికెన్ షాపులు చిన్న, పెద్దవి ఉన్నట్లు నగర పాలక సంస్థ అంచనా. వీటితో వీధుల్లో తోపుడు బండ్లపై చికెన్ అమ్మే బండ్లు 40 వరకు ఉన్నాయి. ముఖ్యంగా



అపరిశుభ్రమైన వాతావరణంలో కోడిమాంసం విక్రయాలు జరుపుతున్న దుకాణదారులు

మటన్, చికెన్ అమ్మకాలు సాగిస్తున్న దుకాణాలు ఏమాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడం గమనార్హం. అలాగే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సమీపంలోని పశు వధశాలలో కూడా ఇదే పరిస్థితి. నగర పాలక సంస్థ ఏటా వేలం లక్షల రూపాయలు పశువధశాల నుంచి నగరపాలక సంస్థకు ఆదాయం వస్తున్నా నగర పాలక సంస్థ దీని నిర్వహణ ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పశువధశాల సమీపంలో నివాసం ఉన్న ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా పశువధశాల నుంచి వచ్చే కంపును భరించలేకపోతున్నామని వాపోతున్నారు. మరోవైపు నగరంలో అమ్మకాలు జరిపే మేకలు, గొర్రెలు, పొట్టేళ్ళలు పశువధశాల వద్దకు తీసుకొచ్చి పశువైద్యులు పరీక్షలు జరిపిన అనంతరం ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించిన తరువాత షాపుల్లో అమ్మకాలు జరపాలి, పశువధశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహించి ఏండ్లు గడుస్తోంది.

అనారోగ్యంగా ఉన్న మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను నగర పాలక సంస్థ పశువధశాలకు తీసుకొచ్చి ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించకుండా నగర ప్రజలకు విచ్చలవిడిగా అధిక రేట్లుకు అమ్మి సొమ్ము చేసుకుటున్నా.. పట్టించుకొనే నాధుడే కరువైయ్యారు. చిత్తూరు నగరంలోని మాంసం దుకాణాలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన మాంసం విక్రయించేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.


బహిరంగ విక్రయాలు..

నిబంధనల ప్రకారం గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు కోళ్లతో సహా బహిరంగ ప్రదేశాల్లో వధించి విక్రయించకూడదు. అయితే చిత్తూరు నగరంలోని మురకంబట్టు, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, సంతపేట, ఓబనపల్లి, గంగనపల్లి వంటి ప్రాంతాల్లో ఆదివారం అయితే రోడ్డులపై వధించి రొడ్డుపైనే అమ్మకాలు జరుపుతున్నారు. ఈ విషయంపై అనేక సార్లు కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు వచ్చినా కట్టిడి చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు పూనుకోకపోవడంతో నేటికి ఆదివారం వచ్చిందంటే ఈ ప్రాంతాల్లో రోడ్లపైనే మాంసం అమ్మకాలు యద్ధేచ్ఛగా సాగిపోతున్నాయి. మరోవైపు పశు వధశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యులు ధృవీకరించిన మాంసాన్ని మాత్రమే విక్రయించాలని మాంసం ప్రియులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే...

మాంసం విక్రయించే చికెన్, మటన్ షాపులు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. నిబంధనలు పాటించని మాంసం దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు ఆరోగ్యకరంగా ఉన్న కోళ్లను మాత్రమే విక్రయించాలి. షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అనేక షాపులు పరిశుభ్రత పాటించడం లేదు. బహిరం వధ, విక్రయాలు చేపట్టరాదు. అలాగే గొర్రెలు, మేకలు, పొట్టేళ్ళు ప్రభుత్వ పశువైద్యుడు వైద్యపరీక్ష నిర్వహించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించిన తరువాత వధించి విక్రయించాలి. పశువైద్యుడు పశువధశాలలో అందుబాటులో లేకపోవడం వాస్తవమే. పశువైద్యశాఖ నుండీ వైద్యుడున్ని నియమించాల్సి ఉంది. ఇందు కోసం పశువైద్యశాఖ ఎడి దృష్టికి తీసుకుపోవడం జరిగింది.

-డాక్టర్ లోకేష్, హెల్త్ ఆఫీసర్



మాంసం విక్రయ దుకాణాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్ డాక్టర్ అరుణ (ఫైల్‌ఫోటో)

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటు చార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెలా విద్యుత్ యూనిట్‌కు రూ.40పైసల చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు (ట్రూఅప్) వసూలు చేయటాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని అన్నారు. ప్రతి నెలా వసూలు చేయడమే కాకుండా మళ్లీ సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదం కూడా ఉందన్నారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం రూ.1400 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలకు పెంచి భారం మోపిందని, 2014- 19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36నెలల పాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారని అన్నారు. దీని వలన 2900 కోట్ల రూపాయల భారం పడిందని, 2020- 21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65పైసలు వరకు 2023 ఏప్రిల్ నుండి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ పేరుతో 3083 కోట్ల రూపాయల భారం వినియోగదారులపై పడనున్నదని మళ్లీ స్మార్ట్ మీటర్లు పెట్టి ఆవ్యయాన్ని నెలవారీగా ప్రజలపై వేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పలురూపాలలో రాష్ట్రప్రభుత్వం విద్యుత్ భారాలు మోపుతున్నదని బడా కార్పొరేట్ కంపెనీల నుంచి విద్యుత్ అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారన్నారు. ఆదాని తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధికరేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు చార్జీల పేరుతో దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాట తప్పి ఈ రీతిలో భారాలు మోపటం అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతినెల విద్యుత్ సర్దుబాటు చార్జీలు విధించి భారాలు వేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను ప్రతిఘటించాలని సిపిఎం ప్రజలకు పిలుపునిస్తున్నదని పేర్కొన్నారు.

సమాజ సేవతోనే వ్యక్తిత్వ వికాసం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సుద్దగుంట గ్రామంలో మార్చి 24 నుంచి మార్చి 30వ తేదీ వరకు జరిగిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేకశిబిరం ఏడవ రోజు ముగింపు కార్యక్రమం సుద్దగుంటలోని సిద్ధసదా శివస్వామి గుడి ఆవరణలో జరిగింది. ఈ ముగింపు వేడుకలకు ప్రముఖ హోమియోపతి వైద్యుడు, దాతత్వవేత్త, కేఆర్ ఇండస్ట్రీస్ యజమాని డాక్టర్ కె.కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సదా సేవాభావం కలిగి ఉండాలన్నారు. డాక్టర్ కె.కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ స్పెషల్‌క్యాంప్ ద్వారా సమయపాలన కార్యనిర్వహణ పద్ధతులు, సేవ ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, జీవిత నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలియజేశారు. శివాలయం అధ్యక్షులు కె.మోహనరాజు, డాక్టర్ పి.వెంకటేసులు, డాక్టర్ ఎసిహెచ్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయ రెడ్డి పలువురు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కమలాకర్ రెడ్డి

డిసిసిబి ఉద్యోగ నియామకాలపై విచారణ జరపాలి : టిడిపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ఇటీవల దాదాపు కొత్తగా 55 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించడం జరిగింది. ఈ పోస్టుల్లో దాదాపు 80 శాతం ఉద్యోగాలను అమ్ముకున్నారనే విమర్శలపై విచారణ జరపాలని తెలుగుదేశం నాయకులు గురువారం విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. బ్యాంకులో కొంతమంది అనధికార వ్యక్తులు, రాజకీయ నాయకులు, మరికొంతమంది డైరెక్టర్లు కలిసి డిసిసిబి ఉద్యోగాల్ని అమ్ముకున్నారని ఆరోపించారు. లక్షలాది రూపాయలు చేతులు మారాయని, దాదాపు 40 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు, 15 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీలో పెద్దఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. చాలా మంది పేద నిరుద్యోగులు కష్టపడి డిగ్రీలు చేసి కష్టపడి అర్హత కలిగిన వారు ఉన్నప్పటికీ లంచాలు తీసుకుని ఉద్యోగాల భర్తీలో అవినీతికి పాల్పడి నిరుద్యోగులకు అన్యాయం చేశారని తెలిపారు. పత్రికలలో దీనికి సంబంధించి వార్త కూడా ప్రచురితమైందని, సంబంధించిన పత్రిక క్లిప్పింగ్ జతపరుస్తున్నామని కావున ఈవార్త పైన పూర్తిస్థాయి విచారణ జరిపించి అవినీతి పైన పూర్తిస్థాయి విచారణ జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి జైపాల్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పట్టణంలోని టాప్‌లైన్, పిజిఆర్ పోలీసు క్వార్టర్స్‌లో శ్రీసీతారామ దేవాలయాల్లో శ్రీరామ నవమి పండుగను చిత్తూరు ఏఆర్ పోలీసులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్దలతో అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి దంపతులు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పి.జగదీష్ దంపతులు, రాముల వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే ఎస్‌పి ఏఆర్ జి.నాగేశ్వరరావు దంపతులు, కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా అటవీశాఖ అధికారి చైతన కుమార్‌రెడ్డి దంపతులు, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ కళ్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ దంపతుల చేతుల మీదుగా సుమారు 700 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు డిఎస్పీ కె.శ్రీనివాసమూర్తి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, దిశ డిఎస్పీ బాబు ప్రసాద్, డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎఆర్ డిఎస్పీ కృష్ణమోహన్, ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగిరెడ్డి, టూటౌన్ ఇన్స్పెక్టర్ మద్దయ్యాచారి, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ డిఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని కొండ మల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా అర్చకులు కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

గంగవరం మండలాల్లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు జరిపించారు.

కార్వేటినగరం: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో వెలసి ఉన్న శ్రీసీత రామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, తోమాల, పంచాగశ్రవణం నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా శ్రీసీతా రాముల కళ్యాణోత్సవం జరిగింది. ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు నారాయణ దాసరి, గోపాలాచారి, సిబ్బంది క్రిష్ణయ్య, సుజాతమ్మ,
మదన్ గోపాల్ పలువురు పాల్గొన్నారు.

నగరి: స్థానిక భేరివీధిలోని కోదండ రామాలయం, పాతభజన గుడి వీధిలోని రామాలయంలోను, కొత్తపేట, నగరి రూరల్ మండలం అయినంబాకం కోదండ రామాలయంలోను శ్రీసీతారాములకు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు.

చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు కోదండరామస్వామి, గిరింపేట అంజనేయస్వామి, దొడ్డిపల్లి రామాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కోదండరామాలయ ఛైర్మెన్ వెంకటేష్ గుప్తా, అంజనేయ స్వామి ఆలయ ఛైర్మెన్ కుమార్లు ఎంఎల్ఏకి ఘనస్వాగతం పలికారు.

బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి పురస్కరించుకుని ఆలయంలోని మూలవిరాటాలకు ప్రత్యేక అభిషేకాలు పూజలు చేసి సుందరంగా అలంకరించారు. సీతా సమేత శ్రీరామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవవిగ్రహాలను సుందరంగా పుష్పాలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ వంశపార ధర్మకర్త తులసి రామకష్ణారెడ్డి, శిరీష్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాష్, మాజీ చైర్మన్ రెడ్డప్ప పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు దిగవూరు, ఎగవూరు సీతారాముల ఆలయాల్లో, తూగుండ్రం గ్రామంలో సీతారామలక్ష్మణ ఆలయంలో, వేపంజేరిలో సీతారాముల పట్టాభిషేకం విగ్రహాలకు అభిషేకం పూజలు చేశారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాం.

జాతర పత్రికల ఆవిష్కరణ



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని రాళ్ల గంగమాంబ జాతర పత్రికను గుడిపల్లి మండల వైసీపీ నాయకులు సమక్షంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్‌ను జాతరకు ఆహ్వానించడం జరిగింది. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ రామ్మూర్తి, ఎంపీటీసీ వెంకటేష్, వెంకటాచలం, బుల్లెట్ దండపాణి పాల్గొన్నారు.

తులసీరామ్ యాదవ్‌కి సన్మానం



ప్రజాశక్తి -పాలసముద్రం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నూతనంగా ఎంపికైన ఎస్.తులసీరామ్ యాదవ్‌ను గురువారం పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసీరామ్ యాదవ్ మాట్లాడుతూ తాను పార్టీ కోసం చేస్తున్న కృషిని గుర్తించి డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియమించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి తమవంతు కృషిచేస్తానని తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు అంబలగన్, ఆర్‌బికె ఛైర్మన్ పోలయ్య, నాయకులు షణ్ముఖరెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై కరకంఠేశ్వరుడు

ప్రజాశక్తి- నగరి: పట్టణపరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కరకంఠేశ్వర స్వామిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. నగరి మర్చంట్స్ అసోసియేషన్ వారు ఉత్సవాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో అభిషేక అర్చనలు అనంతరం ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

2న వైఎస్సార్ ఆసరా పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలకు ఏప్రిల్ 2వ తేదీన మూడోవిడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందనిఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. బైరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మైదానంలో జరిగే వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపి రెడ్డప్ప, జెడ్‌పిటిసి శ్రీనివాసులు, డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరుకానున్నారని తెలిపారు. కనుక ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టవర్ క్లాక్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద నిర్మాణంలో ఉన్న టవర్ క్లాక్ పనులను గురువారం ఎమ్మెల్యే వరప్రసాదరావు పరిశీలించారు. నాణ్యతగా పనులు చేయాలని సూచించారు. ఉన్న టవర్ క్లాక్ శిథిలావస్థకు చేరుకోవడంతో గత సంవత్సరం కూల్చేశారు. నూతన క్లాక్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కుమారుడు నవీన్‌గుప్త తన సొంత నిధులతో పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో పనులను ఎమ్మెల్యే పరిశీలించి నాణ్యతగా త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్ , రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాములకు మంత్రి పట్టువస్త్రాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కాపు వీధిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా, సెల్వమణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను పదిరోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, కౌన్సిలర్ ఏకాంబరం, భానుమతి, చక్రి, కె.నరసింహారావు, జాన్‌కెనడి, శివాలయ ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సిరుగురాజుపాలెం సర్పంచి మురళీమోహన్ యాదవ్, ఆరేటమ్మ ఆలయ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు మునికష్ణయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



ప్రజాశక్తి-పాకాల: నూతనంగా శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన శోభకత్ నామ సంవత్సరం ఉగాది తెలుగు పంచాంగాన్ని, క్యాలండర్లను గురువారం జడ్పీటీసీ పద్మజరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రబోధ సేవాసమితి సభ్యులు త్రైత శకం పంచాంగాన్ని, క్యాలండర్లను పలువురికి అందించారు. జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీకి చెందిన పాకాల సభ్యులు మాధవ, శివ ప్రసాద్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పింజరి పాము విషపూరితం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రక్తపింజరి పాము విషపూరితమని.. పాము కాటేస్తే గుండెకు రక్తం సరఫరా ఆగిపోతుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్నేక్ స్నాచర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి పుత్తూరు మండలంలోని ఏఎం అగ్రహారంలోని ఓ ఇంట్లోకి రక్తపింజరి పాము వెళ్లడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖలో పనిచేస్తున్న స్నేక్‌స్నాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందడంతో గ్రామానికి చేరుకుని పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపింజరి చాలా విషపూరితమని.. వెంటనే తనకు సమాచారం అందిస్తే తాను సాయం చేస్తానని తెలిపారు.

ఎస్‌డీజీ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: ఎస్‌డీజీ సర్వేలో భాగంగా 0-5 సంవత్సరాల పిల్లల వివరాలను సేకరించి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు కోరారు. గత కొన్ని రోజులుగా 18 సంవత్సరాలలోపు పిల్లలకు సంబంధించిన వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్నారు. సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో కోరారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి-కోట: ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలంటే పట్టుదలతో పదో తరగతి పరీక్షల్లో తప్పక విజయం సాధించాలని కోట సబ్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు అన్నారు. కోటలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గురువారం పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యూత్ సభ్యులు మీజూరు చంద్రప్రకాష్ మిత్రబందం దాతత్వంతో విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కోటమ్మ తల్లి ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఎస్సై పుల్లారావులచే విద్యార్థులకు అందించారు. ఎస్సై మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు జీవితానికి ఓ దిక్సూచిలాంటిదని, మంచి ర్యాంకు తెచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అంబేద్కర్ యూత్ సభ్యులు కర్లపూడి కిషోర్, గోపి, రమేష్, తిన్నెలపూడి శివశంకర్, యంపల కిరణ్, ఆదర్శ్‌లను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, పాఠశాల సిబ్బంది, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తొలగని చెత్త..!



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చెత్త రహిత మున్సిపాలిటీలుగా.. గ్రామాలుగా ఏర్పాటు చేయాలన్న నినాదంతో స్వచ్ఛ సర్వేక్షణ ర్యాలీలు చేపడుతోంది. పరిశుభ్రతకు విరివిగా నిధులు వెచ్చిస్తోంది. అయితే పుత్తూరు మున్సిపాలిటీలోని పలు చోట్ల అధ్వానంగా చెత్త దర్శనమిస్తోంది. పురపాలక సంఘం పరిధిలో 14వ వార్డు, షాప్ వీధి చివరిలో చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసనతోపాటు దోమల కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాల బారిన పడుతతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు ప్రభుత్వాసుపత్రిలో రోగుల ఓపీలు సైతం పెరుగుతున్నాయి. చెత్తను తొలగించడంతో ఆలస్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త కుండీ నిండి గత పది రోజులుగా కావస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వడదెబ్బకు సాయం..!

- పోస్టుమార్టం.. వైద్యాధికారి నివేదిక కీలకం - ప్రజల్లో అవగాహన తప్పనిసరి

ఎండలు మండుతున్నాయి.. భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. వత్తిదారులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి వేతనదారులు, శ్రామికులు, రైతులు జీవనోపాధి కోసం ఎండను సైతం లెక్కచేయకుండా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే ఆ కుటుంబం కోలుకోలేని విధంగా నష్టపోతుంది. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం పొందాలంటే అవగాహన అవసరం.



ప్రజాశక్తి-ఓజిలి

వడదెబ్బకు గురవుతున్న వారిలో ఎక్కువగా పేదవారు ఉంటున్నారు. వీరిలో చాలామందికి నష్టపరిహారం ఎలా పొందాలో అవగాహన లేదు. ఇలాంటి వారికి నిపుణులు పలు సూచనలు అందజేస్తున్నారు. వడదెబ్బకు గురైతే ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేస్తుంది. దీనికి సంబంధించి ప్రతి మండలానికి ఓ కమిటీ ఉంటుంది. ఆ కమిటీ వడదెబ్బకు గురై చనిపోయిన వారి వివరాలు నివేదికను కలెక్టర్ పంపుతుంది. ఆయన పరిశీలించి పరిహారాన్ని విడుదల చేయడం జరుగుతుంది. వడదెబ్బ తగలకుండా కూలీలు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని, టోపీలు,హెల్మెట్, గొడుగులు వినియోగించుకోవాలి.

ఎవరిపై ఎక్కువ ప్రభావం

60 సంవత్సరాలు పైబడిన వద్ధులు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగేవాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు సైతం జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

వడదెబ్బ లక్షణాలు:

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపు తప్పుతుంది. నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడతాయి. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం ఏర్పడుతుంది. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సభ్యులుగా అధికారులు

మరోవైపు ఎండ తీవ్రతకు ఉపాధిహామీ వేతనదారులు, శ్రామికులు రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. కారు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు ఎండలోనే తిరగడంతో డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బ మృతుల నిర్ధారణకు కమిటీలో మండల వైద్యాధికారి, తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు. వడదెబ్బతో మరణం సంభవిస్తే కమిటీ సభ్యులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి. ఆ వ్యక్తి వడదెబ్బతో మతిచెందినట్లు ముందుగా వైద్యాధికారి ధ్రువీకరించాలి. అనంతరం పోలీసులు కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి సమీపంలోని ఆసుపత్రికి మతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తారు . ఆ నివేదిక వైద్యాధికారి పోలీసులు ఎఫ్ఐఆర్ ఆధారంగా వడదెబ్బ మతిగా నిర్ధారిస్తారు. ఈ నివేదికను మండల తహశీల్దారుతో ఆర్డీవోకు..అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి నివేదికను సమర్పిస్తారు.

పరిహారంతో ఆసరా



వడదెబ్బ తగులుతున్న వారిలో అధికశాతం కూలీ పనులకు వెళ్లే వారు ఉన్నారు. అనుకోకుండా వీరు మరణిస్తే వడదెబ్బ పరిహారం గురించి అవగాహన లేకపోవడంతో సమాచారం అందజేయలేకపోతున్నారు. వడదెబ్బతో మతిచెందిన వారికి నష్టపరిహారం అందితే వారి కుటుంబసభ్యులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుంది.

- డి.ఆదిలక్ష్మి, ఎస్సై, ఓజిలి

పోస్టుమార్టం తప్పనిసరి



వేసవిలో వేడి గాలులతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అనుకోని సంఘటనల కారణంగా వ్యక్తి మరణిస్తే కుటుంబంలో వ్యక్తులకు నష్టపరిహారం అందుతుంది. మరణించిన వ్యక్తికి తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంటుంది. పరిహారం అందితే బాధిత కుటుంబాలకు కొంతైనా మేలు జరుగుతుంది.

- డాక్టర్.ఎ.మాధవ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కలెక్టర్‌కు నివేదిక పంపుతాం



వడదెబ్బతో ఎవరైనా మరణిస్తే త్రిసభ్య కమిటీకి సమాచారం ఇవ్వాలి. వైద్యాధికారి, ఎస్సై వివరాలు ఇస్తే రెవెన్యూ డివిజన్ అధికారులకు, కలెక్టర్ కార్యాలయానికి నివేదికను సమర్పిస్తాం.

- డి.లాజరస్, తహశీల్దారు, ఓజిలి

టోల్ పన్నును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : దేశంలోని టోల్ ప్లాజాల మార్గంలో వెళ్లే అన్ని రకాల వాహనాలపై ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్ పన్ను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఏపీ పిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ పెంపుతో ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్టీసీలపై భారం పడి ఇంకా నష్టాల్లోకి నెట్టబడతాయి. వాస్తవంగా రహదారుల అభివద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోలుపై రూ.5, ప్రతి లీటరు డీజల్‌పై రూ.2 అదనంగా వసూలు చేస్తున్నారు. 2017-18 బడ్జెట్ కాలం నుంచి ప్రభుత్వం దీన్ని రోడ్లు, మౌలిక సదుపాయాల అభివద్ధి సెస్ గా మార్చేసింది. డీజల్ కొనుగోలుపై కోట్లాది రూపాయలను ఆర్టీసీలు కేంద్రానికి చెల్లిస్తున్నాయి. మౌలిక సదుపాయాల అభివద్ధి సెస్ కింద కోట్లాది రూపాయలను వసూలు చేసింది. ఇదే ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 1000 టోల్ ప్లాజాల ద్వారా 34 వేల 778 కోట్ల రూపాయలను వసూలు చేసింది. మౌలిక వసతుల అభివద్ధి సెస్ వసూలు చేసిన తర్వాత మళ్లీ తిరిగి టోల్ పన్నును వసూలు చేయడం అన్యాయం. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజా రవాణా సంస్థలైన ఆర్టీసీలకు టోల్ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంతో కాలం నుంచి ఆర్టీసీలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిర్దిష్ట కాలపరిమితి తరువాత టోల్ పన్ను వసూలను నిలిపివేయాలి. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే చాలా టోల్ ప్లాజాలు నిర్ణీత గడువు కాలం దాటినా ఇంకా టోల్ పన్నును వసూలు చేస్తూనే ఉన్నాయి. అలాగే ప్రభుత్వం టోల్ ఛార్జీలను ప్రతి సంవత్సరం పెంచుతూనే ఉంది. ఈ చర్య ఆర్టీసీలకు ప్రజలకు ఆర్థికంగా నష్టదాయకం. కేంద్ర ప్రభుత్వం నుంచి టోల్ పన్ను పెంచే ప్రతిపాదిత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేస్తుంది. అభినందనలతో ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరుపతి జిల్లా కమిటీ పేర్కొంది.

ఎస్సై దురుసు ప్రవర్తన స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది . బాధితుల కథనం మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలో ఎస్.ఐ దురుసుగా ప్రవర్తించాడు. ఆదర్శరెడ్డి పై చేయి చేసుకుని అదుపులోకి తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఇందుకు నిరసనగా రోడ్డుపై బైటాయించి పోలీస్ స్టేషన్ ను ము ట్టడించడానికి స్థానికులు ప్రయ త్నించారు. వైసీపీ నేత కుమారుడుకి మద్దతుగా నిరసన తెలపడంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంబి ,ంచింది.ఉద్రిక్తతను కట్టడి చేసేందుకు చిత్తూరు నుంచి అదనపు బలగాలు చేరుకున్నాయి.

శ్రీకోటమ్మ దేవస్థానం భూములు కాపాడాలి

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం భూములను ఆక్రమించిన వారి నుంచి తక్షణమే కాపాడాలని భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్ 1303లో 1.66 సెంట్లు పట్టా భూమి ఉందన్నారు. ఆ సర్వే నంబర్‌లో పురాతన కాలంలో కోనేరు ఉండేదని.. ఉత్సవాలు జరిగేటప్పుడు ఆ కోనేరులో తెప్పోత్సవం జరగడమే కాకుండా చుట్టుపక్కల ప్రదేశాల నుంచి దాహార్తిని తీర్చుకోవడానికి పశువులకు అనుకూలంగా ఉండేదని గుర్తు చేశారు. అయితే ఆ భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమించడమే కాకుండా మిగతా పట్టా భూమిని సచివాలయ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. దేవాలయాల భూముల్లో ఎలాంటి ప్రభుత్వ కట్టడాలను నిర్మించకూడదని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అయితే హైకోర్టు ఉత్తర్వులు దిక్కరించి ఆయా భూములను ఆక్రమించి ఉండటం దారుణమని తెలిపారు.

చదువుతోనే ఉన్నత విలువలు

తిరుపతి టౌన్ : చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, బాగా చదువుకుని ఉన్నత విలువలతో రాణించాలని, అపుడే ఆ కుటుంబం, గ్రామం, మండలం అభివృద్ధి చెందుతుందని న్యాయవాది ఎస్ఎం అంబిక తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మ కళాక్షేత్ర అకాడమీకి చెందిన 20 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పేద పిల్లలకు తిరుపతిలోని ఎస్.భారత్ ఆన్‌లైన్ ట్రావెల్స్ టికెట్లు అధినేత ఎస్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జామెంటరీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పెద్దకాపులేఔట్‌లో జరిగింది. నరసింహారెడ్డి, రవి, శ్రీదేవి పాల్గొన్నారు.




స్విమ్స్‌లో చైర్‌ఓరేషన్ విజయవంతం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చైర్ ఓరేషన్ కార్యక్రమం విజయవంతమైందని డైరెక్టరు డాక్టరు వెంగమ్మ తెలిపారు. స్థానిక పద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఇలాంటి వైద్య విద్య కార్యక్రమాలకు హాజరుకావడం ద్వారా వైద్య పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన న్యూరో సర్జరీ విభాగాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురానికి చెందిన శ్రీచిత్ర తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సస్ అండ్ టెక్నాలజీ డైరెక్టరు డాక్టరు సంజయ్ బిహారీ బయో ఎథిక్స్ ఇన్ మెడిసిన్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు శరణ్ బి సింగ్, డాక్టరు రామ్, డాక్టరు రమేష్ చంద్ర, డాక్టరు శివకువవమార్, అలోక్ సచిన్, కళావత్, డాక్టరు వనజాక్షమ్మ పాల్గొన్నారు.



'ఇంకా కొనసాగుతున్న మహద్ పోరాటం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇంకా కొనసాగుతున్న పోరాటం' పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతి ఎంఆర్‌పల్లిలోని ఆర్‌పిఐ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1927లో ముంబాయి నగరంలో మహద్ చెరువునందు దళితులు తాగునీరు తీసుకోకుండా నిషేధించడం జరిగిందని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన చదువు పూర్తి అయిన తరువాత మొట్టమొదటిసారి చేపట్టిన ఉద్యమం మంచినీటి పోరాటమన్నారు. ఈ పోరాటాన్ని పౌరహక్కుల ఉద్యమ నేత బొజ్జాతారకం 2011లో ఆంగ్లంలో రాశారని, తెలుగు ప్రజల కోసం ముఖ్యంగా ఉద్యమ కారుల కోసం ప్రముఖ రచయిత్రి యార్లగడ్డ నిర్మల అనువదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గొడుగుచింత గోవిందయ్య, ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, బిసీ ఉద్యమ నాయకులు సదాశివం, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య, సామాజిక ఉద్యమ నేత సంగీతం విశ్వనాథం, ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులు ఎ.సుబ్రమణ్యం, బొజ్జా తారకం కాలనీ అధ్యక్షులు మేకల బాబు పాల్గొన్నారు.



ఆయుర్వేద ఫార్మసీ పరిశీలన

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన మందుల తయారీ కేంద్రాన్ని టీటీడీ జేఈవో శ్రీమతి సదా భార్గవి గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఎస్వీ గోశాలలో నిర్మించిన పరిమళ భరిత అగర బత్తీల తయారీ రెండో యూనిట్ , నూతనంగా నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ను పరిశీలించారు. శుక్రవారం ఉదయం టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ఈ మూడు ప్లాంట్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జేఈవో సదా భార్గవి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, ఈ ఈ లు మనోహర్, మురళీకష్ణ, డి ఈ సరస్వతి, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి డాక్టర్ నారప రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏకశిలానగరం ముస్తాబు
నేడు ధ్వజారోహణం

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఆలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని అంటారు. మార్చి 31 నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు జరుగనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. కంకణభట్టార్ కెహెచ్.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శుక్రవారం ధ్వజారోహణం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్లు వెంకటేశయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కోదండ రామాలయం వద్ద నిర్వహించిన పోతన భాగవతం కవి సమ్మేళనం భక్తులను ఆకట్టుకుంది.

నేడు ' సంకెళ్లను తెంచుకుంటూ ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు ఆత్మకథ ' సంకెళ్లను తెంచుకుంటూ ' పుస్తకాన్ని శుక్రవారం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నామని డాక్టర్ ఎన్ .సిద్దోజీ రావు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకి మాధవరావు రాసిన సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకంలో తాను చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న పరిస్థితులు చిన్న పాలేరు నుండి చీఫ్ సెక్రటరీగా ఎదిగిన క్రమాన్ని పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. ఈ పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్ హాజరవుతారన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకులంలో 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నుండి 13 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్కులు ఆధారంగానే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షకు నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

నాయుడుపేట సీఐకి తప్పిన పెనుప్రమాదం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు భారీ ప్రమాదం నుంచి బయటపడ్డారు. పండ్లూరు సమీపంలో నాయుడుపేట నుంచి పండ్లూరుకి వెళుతున్న సీఐ వాహనాన్ని వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో కారులోని సీఐతోపాటు డ్రైవర్ భాస్కర్, హోమ్‌గార్డు వెంకటేశలు, కానిస్టేబుల్ చిరంజీవి గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం నాయుడుపేటలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సీఐను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం, పొట్లూరి రాజేష్ ఆయనను పరామర్శించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి- నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టు హైవే బ్రిడ్జి సమీపం పొదల్లో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందాడు. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళకత్యాలు తీర్చుకోవడానికి ఏటిగట్టున పొద్దళ్ల వద్దకు వెళ్లిన వారు మతదేహం చెట్టుకు వేళాడుతూ ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మతదేహాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి ఎవరని గుర్తించ లేకపోయారు. మృతునికి వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుంది. జంధ్యం ధరించి ఉన్నాడు. మృతదేహానికి సమీపంగా పురుగుల మందు బాటిల్ కూడా ఉండటంతో ఆత్మహత్య చేసుకోవాలన్న కృతనిశ్చయంతో వచ్చినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి- గూడూరు మార్గంలోని బాలాయపల్లి మండలం వెంకటరెడ్డిపల్లి గ్రామం వద్ద గురువారం విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్ఐ రామకష్ణనాయక్, సివిల్‌సప్లై డీటీ సంధ్య దాడులు నిర్వహించి వెంకటరెడ్డిపల్లి వద్ద సుమారు 112 బస్తాలు (5 టన్నులు 200 కేజీలు) బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బాలాయపల్లి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ఛైర్మన్‌గా చిరంజీవి



ప్రజాశక్తి-రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తిరుపతి జిల్లా ఓబీసీ ఛైర్మన్‌గా రేణిగుంట పట్టణానికి చెందిన చిరంజీవి ఎన్నికయ్యారు. గురువారం రేణిగుంట పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తిరుపతి జిల్లా ఓబీసీ ఛైర్మన్‌గా ఎన్నుకున్న ఏపీసీసీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకట్రావు కతజ్ఞతలు తెలిపారు. జిల్లాస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభివద్ధికి కషి చేస్తానన్నారు. గ్రామీణ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు పదవి రావడానికి కషి చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కతజ్ఞతలు తెలిపారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కస్తూరిబాయి, మహాత్మా గాంధీ చేపల మార్కెట్ వద్ద అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిత్రకళాకారునికి సిపిఐ అభినందనలు



ప్రజాశక్తి - తిరుచానూరు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ప్రముఖ చిత్రకారుడైన పల్లె చిరంజీవి క్లాత్ పై కాఫీ పొడితో చిత్రీకరిస్తున్న అంబేద్కర్ చిత్రపటాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, జిల్లా నేతలు గురువారం సాయంత్రం ఐదు గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సందర్శించి, చిత్రకళాకారుని అభినందించారు. ఈ సందర్భంగా కే నారాయణ , పి. హరినాథ రెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులో పల్లె చిరంజీవి, ఆయనసతీమణి అశ్వినీల పట్టుదల, వారి సంకల్పం సంపూర్ణంగా నెరవేరాలని ఆకాంక్షించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా గొప్ప వ్యక్తని, ఆ మహనీయుని చిత్రపటాన్ని భారీ స్థాయిలో ఏర్పాటు చేసి తిరుపతి యూనివర్సిటీ నుండి దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళ్లాలి అన్న చిరంజీవి ఆలోచన మంచి ఉద్దేశంతో కూడుకున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పి మురళి , నాయకులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, జై విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎస్వీయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి నిధులు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి రూ.40 లక్షల నిధులను యూజీసీ విడుదల చేయడంపై వీసీ ఆచార్య కె రాజారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిధులు తీసుకురావడంలో నిరంతరం శ్రమించిన డైరెక్టర్ ఆచార్య కోదండరామిరెడ్డిని అభినందించారు. సదరు గ్రాంటు దస్త్రాన్ని డైరెక్టర్ కు అందజేశారు.2021-2022 సంవత్సరానికి రావలసిన నిధులు పూర్తిగా వచ్చాయని, గడచిన రెండు విద్యాసంవత్సరాలలో యుజిసి ద్వారా రావాల్సిన రూ.2.45 కోట్లు ఎస్వీయూకి అందాయని చెప్పారు.